శోభాయమానంగా శోభాయాత్ర



లక్ష్మీనృసింహస్వామి శోభాయాత్రలో పాల్గొన్న బాలినేని శచీదేవి



భారీగా పాల్గొన్న భక్తులు

● వరాహ లక్ష్మీనృసింహస్వామి పూజలో పాల్గొన్న బాలినేని శచీదేవి

ఒంగోలు మెట్రో: నరసింహస్వామి భక్త బృందం ఆధ్వర్యంలో ఒంగోలు నగరంలో మొదటిసారి సింహాచలం దేవస్థానం వారిచే శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శోభాయాత్రను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శనివారం మధ్యాహ్నం ఐదు గంటల నుంచి స్థానిక చెన్నకేశవస్వామి గుడి వద్ద నుంచి సింహాచలం దేవస్థాన వేద పురోహితుల పర్యవేక్షణలో శోభాయాత్ర ప్రారంభమైంది. ముందుగా చెన్నకేశవస్వామి దేవస్థానం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సతీమణి బాలినేని శచీదేవి పాల్గొన్నారు. లక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి శోభాయాత్రను ప్రారంభించారు. నగరంలోని ప్రధాన వీధులైన కోర్టు సెంటర్ కేఫ్, పప్పు బజారు, దక్షిణం బజార్, ఏనుగు చెట్టు, నెల్లూరు బస్టాండ్ మీదుగా బీకే అపార్ట్‌మెంట్ వరకు శోభాయాత్ర సాగింది. నరసింహస్వామి భక్త బృందం కోలాటాలు, మేళతాళాలు, భారీగా పాల్గొన్న భక్తుల గోవింద నామస్మరణతో అంగరంగ వైభవంగా యాత్ర సాగింది. కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, చెన్నకేశవస్వామి దేవస్థానం చైర్మన్ గురునాథరావు, కుర్రా ప్రసాద్‌బాబు, నిర్వాహకులు చక్కా ప్రసాదు, నల్లమల్లి బాలు, అన్నం శ్రీనివాసులు, వేముల కోటిలింగం గుప్తా, గుర్రం బదరీ నారాయణ, లలూ బద్రీనాథ్, కమలాకర్, కోడూరి కిషోర్, కొమ్మిశెట్టి రంగ, మీరావలి, రాము, పద్మనాభుని నందకుమార్, బాలసుబ్రహ్మణ్యం, చక్క సురేష్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైభవంగా విగ్రహ ప్రతిష్ట

● పాల్గొన్న బాలినేని శచీదేవి, ప్రణీత్‌రెడ్డి



కలశాల ఊరేగింపులో బాలినేని శచీదేవి

ఒంగోలు మెట్రో: స్థానిక గోపాలనగరం ఒకటో లైను చివర్లో కార్పొరేటర్ ఎండేటి పద్మావతి రంగారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సతీమణి బాలినేని శచీదేవి, తనయుడు, వైఎస్సార్ సీపీ యువనేత బాలినేని ప్రణీత్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు. 108 కలశాలతో అభిషేక కార్యక్రమంలో శచీదేవి పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

కొత్తపట్నంలో వినాయకుని గ్రామోత్సవంలో పాల్గొన్న ప్రణీత్‌రెడ్డి...



వినాయకుని గ్రామోత్సవంలో బాలినేని ప్రణీత్‌రెడ్డి

కొత్తపట్నం: వినాయకచవితి సందర్భంగా ఏర్పాటు చేసి 47 రోజుల పాటు పూజలందుకున్న గణపతి విగ్రహానికి శనివారం రాత్రి కొత్తపట్నంలో వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ యువనేత బాలినేని ప్రణీత్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు. ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

కార్యాలయాన్ని ప్రారంభించిన మేయర్ గంగాడ



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు: కార్మిక సంక్షేమ బోర్డు సభ్యుడు పెద్దిపోగు కోటేశ్వరరావు కార్యాలయాన్ని నగర మేయర్ గంగాడ సుజాత శనివారం ప్రారంభించారు. స్థానిక ఆనందరావు రోడ్డులో కెనరా బ్యాంకు పక్కన ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం మేయర్ మాట్లాడుతూ కోటేశ్వరరావు తనవంతుగా పార్టీ గెలుపునకు కృషిచేసేందుకు ముందుకొచ్చినందుకు అభినందనలు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో కాలుష్యానికి చెక్



మర్లపాడులో కందిలో అంతర పంటలను పరిశీలిస్తున్న డీపీఎం సుభాషిణి

ఒంగోలు సెంట్రల్: ప్రకృతి వ్యవసాయంతో గొప్ప సామాజిక మార్పు వస్తుందని డీపీఎం సుభాషిణి అన్నారు. జిల్లాలోని పలు గ్రామాల్లో శనివారం ఆమె పర్యటించి రైతులకు సలహాలు, సూచనలు చేశారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా కరవదిలో పంట పండిస్తున్న పద్మావతి, గాదెపాలెంలో ఎకరాలో పొద్దుతిరుగుడు, రాగి సాగు చేసిన ఝాన్సీ, మర్లపాడులో రైతు సద్గుణ సాగుచేసిన కంది అంతర పంటలు, 20 సెంట్లలో సాగు చేసిన (ఏటీఎం) కూరగాయలను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయంతో రసాయనాల అవశేషాలు లేని ఆహారం దొరుకుతుందని, దీంతో మనుషులు ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. సస్యరక్షణపై రైతులకు సలహాలు, సూచనలు చేశారు.

పన్నుల వసూళ్లలో వెనకబడితే సహించేది లేదు



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: నగరంలో ఇంటి పన్నులు, కుళాయి పన్నులు, క్లాప్ యూజర్ చార్జీల వసూళ్లలో వెనకబడితే సహించేది లేదని వార్డు సచివాలయ సిబ్బంది, నగరపాలక సంస్థ రెవెన్యూ విభాగం అధికారులను ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు హెచ్చరించారు. శనివారం నగరంలోని పలు డివిజన్లలో ఆయన పర్యటించారు. పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యంగా వ్యవహరించి లక్ష్యాలను చేరుకోకపోతే అధికారులు, సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని కమిషనర్ స్పష్టం చేశారు. నెలవారీ లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. పన్నుల వసూళ్లలో పురోగతి లేదని పలువురు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ కట్టడాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ శానిటేషన్ అధికారులు, రెవెన్యూ, ఇంజినీరింగ్ అధికారులతో పాటు 50వ డివిజన్ కార్పొరేటర్ అంబటి ప్రసాదు పాల్గొన్నారు.

చిన్నారుల యోగక్షేమాలు తెలుసుకున్న యాదల



వెంకటలక్ష్మి దంపతుల ఇంటికి వెళ్లి చిన్నారుల యోగక్షేమాలు తెలుసుకుంటున్న డాక్టర్ యాదల అశోక్‌బాబు

ఒంగోలు టౌన్: నగరంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన మార్తాల వెంకటలక్ష్మి, శ్రీనివాసరెడ్డి దంపతులకు ఒకే కాన్పులో ముగ్గురు సంతానం కలగడం, వారు తక్కువ బరువుతో పుట్టడంతో ఆరోగ్యశ్రీ రాష్ట్ర ప్రత్యేక అధికారి డాక్టర్ యాదల అశోక్‌బాబు శనివారం వారింటికి చేరుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే స్థానిక లంబాడీడొంకలోని అమ్మ పిల్లల వైద్యశాలలో పిల్లలకు చికిత్స చేయించిన విషయం తెలిసిందే. సుమారు రూ.25 లక్షల విలువ చేసే చికిత్సను ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా చేయించి అక్టోబర్ 18న డిశ్చార్జి చేశారు. ఈ నేపథ్యంలో శనివారం వారింటికి వెళ్లిన అశోక్‌బాబు.. ఆ దంపతులను పలకరించి పిల్లల యోగక్షేమాలడిగి తెలుసుకున్నారు. ముగ్గురు చిన్నారుల ఆరోగ్యం గురించి వాకబు చేశారు. రాష్ట్ర స్థాయి అధికారి ఇంటికి స్వయంగా రావడంతో వెంకటలక్ష్మి దంపతులు సంతోషం వ్యక్తం చేశారు. తోపుడు బండి మీద వీధులలో తిరుగుతూ ఫ్యాన్సీ వస్తువులు విక్రయిస్తూ జీవనం గడిపే తమకు ఆరోగ్య శ్రీ చేసిన మేలు ఎన్నటికీ మరిచిపోలేనని శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన రోజున పిల్లల బరువు 1.7 కిలోలు ఉండగా, ఇప్పుడు 2.1 కిలోలకు పెరిగిందని వివరించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని వారు అన్నారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ఆరోగ్య శ్రీ పథకం ఎంతో మెరుగ్గా పనిచేస్తోందని, ఎంతో మంది నిరుపేదలకు సహాయ పడుతుందని చెప్పారు.

జగనే సీఎం.. ఎందుకు కావాలో వివరించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

● శిక్షణ కార్యక్రమంలో సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

నాగులుప్పలపాడు: రాష్ట్రానికి సుపరిపాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి ఎందుకు కావాలనే విషయాన్ని ప్రజలకు వివరించాలని సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. జగనే ఎందుకు సీఎం కావాలి అనే కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారధులకు శనివారం నాగులుప్పలపాడు మండల స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని ఉప్పుగుండూరు కాపు కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధాకర్‌బాబు సీఎం జగన్ అందించిన సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అనుభవించిన ప్రతిఒక్కరూ గ్రామగ్రామాన ఈ విషయాన్ని తెలియజేయాలని కోరారు. రాష్ట్ర చరిత్రలో అసలైన సామాజిక న్యాయం అమలు చేసిన ముఖ్యమంత్రి జగన్ మాత్రమేనని తెలిపారు. అలాంటి పాలన అందిస్తున్న ముఖ్యమంత్రిని మళ్లీ ఎన్నుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. 2014లో గెలిచిన టీడీపీ.. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలకు చేసిన మోసాన్ని, 2019లో సీఎం అయిన జగన్ మేనిఫెస్టో పూర్తిగా అమలు చేసి చెప్పనవి కూడా చేసిన వైనాన్ని కూలంకషంగా క్షేత్రస్థాయిలో వివరించాలని తెలిపారు. మాదిగ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కొమ్మూరి కనకారావు మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజలను ఆదరిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవడంతో పాటు రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ జెండా ఎగరడానికి ఇప్పటి నుంచే అందరం కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ స్టేట్ స్పెషలాఫీసర్ యాదల అశోక్‌బాబు మాట్లాడుతూ పేదల అభ్యున్నతి, ఆరోగ్యంపై శ్రద్ధ వహించిన మహానుభావుడు సీఎం జగన్ అని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఇనగంటి పిచ్చిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారుబాబు, పార్టీ మండల కన్వీనర్ పోలవరపు శ్రీమన్నారాయణ, పొగాకు బోర్డు సభ్యుడు మారెడ్డి సుబ్బారెడ్డి, గృహ నిర్మాణ సంస్థ స్టేట్ డైరెక్టర్ కొలకలూరి విజయ్‌కుమార్, జేసీఎస్ మండల కన్వీనర్ కుమ్మూరి సుధాకర్, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు దశరథరామయ్య, కూనం పూర్ణచంద్రరావు, పులిచర్ల పరంధామిరెడ్డి, ఇనగంటి వెంకట రమణారెడ్డి, గ్రామ సర్పంచ్ దేవరకొండ జయమ్మ, ఎంపీటీసీ మున్నంగి వెంకట్రావు, కోయి హనుమయ్య, మాదాసు రాంబాబు, ప్రసన్న, రమణమ్మ, చంద్రయ్య, వైకుంఠ వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక క్యాంపులను పరిశీలించిన ఆర్డీవో



పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న ఆర్డీవో విశ్వేశ్వరరావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు

ఒంగోలు అర్బన్: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎలక్ట్రోరల్ ప్రక్రియలో భాగంగా చేపట్టిన పోలింగ్ కేంద్రాల్లోని ప్రత్యేక క్యాంపులను ఒంగోలు ఆర్డీవో విశ్వేశ్వరరావు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి శనివారం పరిశీలించారు. కొత్త ఓటర్ల నమోదుతో పాటు ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులపై వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని బీఎల్వోలకు సూచించారు. నగరంలోని డీఆర్‌ఆర్‌ఎం హైస్కూల్, అంబేడ్కర్ భవన్, మంగమూరు డొంక, కర్నూలు రోడ్డు తదితర ప్రాంతాల్లో పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆర్డీవోతో పాటు వైఎస్సార్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు సంజీవ్, రాజశేఖర్, సత్యం, స్వరూప్, రసూల్, డీటీ రఫీ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌లను పరిశీలించిన తహసీల్దార్



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ మురళి

ఒంగోలు రూరల్: ఒంగోలు తహసీల్దార్ పసుపులేటి మురళి ఒంగోలు నగరంతో పాటు రూరల్ మండలంలోని పోలింగ్ కేంద్రాలను శనివారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలను పరిశీలించారు. మంచినీటి సౌకర్యం, వాష్‌రూమ్‌లు, ఓటు వేసేందుకు వచ్చే ఓటర్లు వేచి ఉండేందుకు ఖాళీ ప్రదేశాలు, ప్రహరీ, విద్యుత్ సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్‌ఓలతో మాట్లాడి సౌకర్యాల మెరుగుదలకు హెచ్‌ఎంలను సంప్రదించాలని, నాడు–నేడు పనులు జరుగుతున్న పోలింగ్ కేంద్రాలైన పాఠశాలల్లో వేగంగా పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఒంగోలు ఎంపీడీఓ అజిత కరవదిలోని 5 పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. వారి వెంట ఆయా సచివాలయాల కార్యదర్శులు, వార్డు అడ్మిన్లు పాల్గొన్నారు.

చెకుముకి సైన్స్ సంబరాలను విజయవంతం చేయండి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జేవీవీ నాయకులు

చీమకుర్తి: జిల్లాలో నిర్వహించనున్న చెకుముకి సైన్స్ సంబరాలను విజయవంతం చేయాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ బీ జవహర్ విజ్ఞప్తి చేశారు. చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్లను శనివారం చీమకుర్తిలోని జవహర్ ఆస్పత్రి ప్రాంగణంలో జేవీవీ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జవహర్ మాట్లాడుతూ గత 33 సంవత్సరాలుగా ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించే కార్యక్రమాలను ప్రోత్సహిస్తూ చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా పాఠశాల స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ప్రభుత్వ, ప్రైవేటు హైస్కూళ్లలోని 8, 9, 10 తరగతులు చదివే విద్యార్థులకు చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తామన్నారు. ఈ నెల 10న పాఠశాల స్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చీమకుర్తి మండలంలోని అన్ని హైస్కూళ్ల విద్యార్థులు హాజరయ్యేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జేవీవీ మండల అధ్యక్ష, కార్యదర్శులు నల్లూరి వెంకటేశ్వరరావు, చలువాది రమేష్, బీ ఆంజనేయులు, చలువాది శ్రీనివాసరావు, ఏ వీరారెడ్డి, ఎస్‌పీ వెంకటేశ్వర్లు, శిలార్ సాహెబ్, మన్నం సుబ్బారావు, దేవదాసు, జీ వెంకటేశ్వర్లు, పీరుసాహెబ్, వెంకట్రావు పాల్గొన్నారు.

8న శ్రీగిరిలో మహా సుదర్శన హోమం



టీటీడీ డైరీలు, క్యాలెండర్లతో శ్రీగిరి పాలకవర్గం, అర్చకులు

ఒంగోలు మెట్రో: ఒంగోలు కొండమీద గల శ్రీగిరి వెంకటేశ్వరస్వామి దేవస్థానం గోశాలలో టీటీడీ నూతన సంవత్సరం డైరీలు, క్యాలెండర్ల విక్రయ కేంద్రాన్ని శనివారం ఉదయం ప్రారంభించారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు జ్వాలా రామారావు, కార్య నిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు, ధర్మకర్తల మండలి ప్రతినిధులు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీకుమారి, శ్రీగిరి దేవస్థానం అర్చకులు, వేద పండితులు, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు. 2024 నూతన సంవత్సర టీటీడీ డైరీలు, క్యాలెండర్లు పరిమిత సంఖ్యలో వచ్చినందున భక్తులకు ఒక్కొక్కరికి ఒక్కొక్క డైరీ, క్యాలెండర్ మాత్రమే అందజేస్తున్నట్లు వారు తెలిపారు. అదేవిధంగా ఈ నెల 8వ తేదీ దేవస్థానం వ్యవస్థాపక ధర్మకర్త దివంగత ఆలూరు వేంకట రమణారావు జయంతిని పురస్కరించుకుని ఉదయం ఏడు గంటలకు టీటీడీ వేద పండితులచే శ్రీగిరిలో మహా సుదర్శన హోమం నిర్వహించనున్నట్లు చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి వెల్లడించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని కోరారు.

ఆరుగురు బీఎల్‌ఓల సస్పెన్షన్

ఒంగోలు అర్బన్: విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్‌ఓలు) ఆరుగురిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ దినేష్‌కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెండ్ అయిన వారిలో ఒంగోలు నియోజకవర్గానికి చెందిన 175వ పోలింగ్ కేంద్రం బీఎల్‌ఓ, దేవుడు చెరువు సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీ మేడూరి రామారావు, మహిళా పోలీసు యాస్మిన్ బేగం, 60వ పోలింగ్ కేంద్రం బీఎల్‌ఓ, సత్యనారాయణపురం సచివాలయం ఉమెన్ అండ్ వీకర్ సెక్షన్ సెక్రటరీ ఏ ఈస్టర్‌రాణి, 88వ పోలింగ్ కేంద్ర బీఎల్‌ఓ, గాంధీనగర్ సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీ డి.హనుమంతరావు ఉన్నారు. అదేవిధంగా సంతనూతలపాడు నియోజకవర్గంలో 188వ పోలింగ్ కేంద్రం బీఎల్‌ఓ, హెచ్.నిడమానూరు సచివాలయం విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ శ్రీలక్ష్మి, 57వ పోలింగ్ కేంద్రం బీఎల్‌ఓ, చినరావిపాడు సచివాలయం వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ కె.అపర్ణ ఉన్నారు.

అసౌకర్యాలకు చెక్

● రవాణాశాఖ ఉపకమిషనర్ ఆర్.సుశీల



మాట్లాడుతున్న రవాణాశాఖ ఉపకమిషనర్ సుశీల, ఎంవీఐలు

ఒంగోలు: అసౌకర్యాలకు చెక్‌పెట్టే దిశగా రవాణాశాఖ కార్యక్రమాలు నిర్వహిస్తోందని ఆ శాఖ ఉప కమిషనర్ ఆర్.సుశీల తెలిపారు. శనివారం స్థానిక రవాణాశాఖ కార్యాలయంలోని తన చాంబర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రమాద రహిత ప్రయాణాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. నగరంలో, జాతీయ రహదారులపై హెల్మెట్ లేకుండా ప్రయాణించడం సరికాదన్నారు. ఇకనుంచి ఎన్‌ఫోర్స్‌మెంట్ ముమ్మరంగా అమలుచేయడం జరుగుతుందన్నారు. తనిఖీలలో పట్టుబడితే జరిమానాలు కూడా భారీగా ఉంటాయని హెచ్చరించారు. అందరూ హెల్మెట్, సీటు బెల్టు ధరించి వాహనాలకు బీమా చెల్లించాలని కోరారు. వాహనాలకు సంబంధించిన పత్రాలతో పాటు డ్రైవింగ్ లైసెన్స్‌లు తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. జూలై 25కు ముందు జారీచేయాల్సిన డ్రైవింగ్ లైసెన్స్‌ల కార్డులను ప్రస్తుతం తపాలాశాఖ కార్యాలయం ద్వారా పంపుతున్నామని, ఇంకా 50 వేల డ్రైవింగ్ లైసెన్స్‌లు ప్రింటింగ్‌లో ఉన్నాయని, వాటిని కూడా త్వరలోనే సంబంధిత వ్యక్తులకు పంపుతామని వివరించారు. జూలై 25 నుంచి ప్రభుత్వం విధానం మార్చినందున కార్డుల ప్రింటింగ్ లేదని సుశీల తెలిపారు. విలేకరుల సమావేశంలో ఎంవీఐలు కిరణ్ ప్రభాకర్, రామచంద్రరావు, జగదీష్, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం భారీ వాహన యజమానులు, ఆటో రిక్షా డ్రైవర్లు, యజమానులతో సమీక్షించి పలు సూచనలు చేశారు.

స్పార్క్ సినిమా హీరోహీరోయిన్ల సందడి



హీరో విక్రాంత్, హీరోయిన్ రుక్సార్‌దిల్లాన్

ఒంగోలు మెట్రో: ఈ నెల 17వ తేదీ విడుదల కానున్న స్పార్క్ సినిమా దర్శకుడు, హీరో విక్రాంత్, హీరోయిన్ రుక్సార్‌దిల్లాన్, చిత్ర బృంద సభ్యులు శనివారం సినిమా ప్రమోషన్‌లో భాగంగా ఒంగోలులో పర్యటించారు. నగరంలోని సరోవర్ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సందడి చేశారు. సినిమాను ఇష్టపడే ప్రేక్షకులు ఒంగోలులో ఎక్కువగా ఉన్నారనే ఉద్దేశంతో మూవీ ప్రమోషన్ ఇక్కడ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మూడు సంవత్సరాలుగా రాజీపడకుండా స్పార్క్ చిత్ర నిర్మాణం జరిగిందన్నారు. సినిమాను ఆదరించాలని కోరారు.

ఎయిడెడ్ టీచర్ పోస్టుల భర్తీ వాయిదా

ఒంగోలు సెంట్రల్: ఎయిడెడ్ టీచర్ పోస్టుల భర్తీకి సంబంధించి నిర్వహించాల్సిన పలు పరీక్షలను కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ వాయిదా వేశారు. ఆయా పాఠశాలలో పోస్టుల భర్తీపై అవకతవకలపై మాదిగ సంక్షేమ పోరాట సమితి అధ్యక్షుడు సుజన్, బీసీ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జయరామ్ ఫిర్యాదు మేరకు స్పందించి వాయిదా వేయటంపై ఆ సంఘ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

కొత్తపట్నం: శ్రీవాణి విద్యానికేతన్ ఆధ్వర్యంలో ఒంగోలు శ్రీరామ్ హాస్పిటల్ సహకారంతో ఆదివారం స్థానిక శ్రీవాణి విద్యానికతన్ స్కూల్ ఆవరణలో ఉచిత మెగా మల్టీ స్పెషాలిటీ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ చాపల వంశీకృష్ణ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి జరిగే వైద్య శిబిరాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.